కాలనీలు.. దోమల నిలయాలు!

కాజీపేటలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ
- జనాలను కుట్టిచంపుతున్న దోమలు
- దోమల ఉత్పత్తి కేంద్రంగా శివారు కాలనీలు

కాజీపేట: పట్టణంలో ప్రజలకు దోమల బాధ అధికమైంది. శివారు కాలనీల్లో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చేపడుతున్న చర్యల మాట దేవుడు ఎరుగు.. చీకటి పడితే మాత్రం దోమలు మెరుపు వేగంతో ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఆవాసాల మధ్య గడ్డి, సర్కార్ తుమ్మలు, వృథా నీటి నిల్వలు, అస్తవ్యస్త డ్రెయినేజీలు, చెరువులను తలపించేలా ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుతున్నాయి. ఇంత తీవ్ర ప్రభావం ఉన్న ప్రాంతంలో మున్సిపల్ మలేరియా విభాగం చేపడుతున్న దోమల నివారణ చర్యలు మాత్రం అంతంతే.. ఏ కాలనీలో చూసినా.. చీకటి పడుతుందంటే ప్రజలు దోమలు భయంతో వణికుతున్నారు. దోమ కాటువల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతూ ఆస్పత్రులపాలవుతున్నారు. సాయంత్రం వేళ ప్రతి ఇంటిలో దోమల నివారణ చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దోమల నివారణ కాయిల్స్, లిక్విడ్ బాటిల్స్ ప్రతి ఇంటిలో కనిపిస్తున్నాయి.. పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో వచ్చే సంపాదనలో కొంతభాగం దోమల నివారణకు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. గతంలో మాదిరిగా దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వేయడం వంటి చర్యలు మున్సిపాల్ అధికారులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


కాజీపేటలో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు


కుక్కలు, పందుల సంచారం

పేరుకుపోయిన మురుగు..
కాల్వల్లో మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన.. దోమల బెడద ఎక్కువైంది. గతంలో కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేసేవారు. నేడు మందు చల్లే వారు కనిపించడం లేదు. దీంతో దోమలు విపరీతంగా పెరిగి కంటిమీద కునుకులే కుండా చేస్తున్నాయి.


– దావా సుధాకర్, కాజీపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్సై మున్నీరుల్లా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందినప్పటికీ అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సెల్ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత క్రమ శిక్షణతో ఎదగాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కితే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. ఒకవేళ మోసపోతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

ప్రొఫెసర్ వెంకటయ్యకు అభినందన


వెంకటయ్యను అభినందిస్తున్న మంద కృష్ణమాదిగ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్‌సైన్స్ విభాగం అధిపతిగా బాధ్యతలను స్వీకరించిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ సంకినేని వెంకటయ్యను గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అభినందించారు. యూనివర్సిటీలోని వీసీ లాడ్జ్‌కు వచ్చిన చ్చేసిన మంద కృష్ణమాదిగ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ సమక్షంలో వెంకటయ్యను సన్మానించి పూలబొకేను అందించి అభినందించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన వెంకటయ్య కేయూలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతిగా నియమితులు కావటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బాధ్యులు మంద కుమార్‌మాదిగ, బొడ్డు దయాకర్, సూరన్న, బిత్రు మహేందర్, గోలి సుధాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వెంకటయ్యను వివిధ విద్యార్థిసంఘం నాయకులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, బీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, స్వేరో బాధ్యులు సాయి, సాయికుమార్, సందీప్, నరేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీకాంత్‌కు డాక్టరేట్


శ్రీకాంత్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకుడు శ్రీకాంత్ వల్లాలకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ బయోకంపోసిట్స్ – ఏ కంపారేటివ్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి.. శ్రీకాంత్‌వల్లాలకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నరసింహాచారి తెలిపారు. ఆవిభాగం ఆచార్యులు రాజనరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీకాంత్ తన పరిశోధన పూర్తిచేశారు. హనుమకొండ జిల్లా భీమారానికి చెందిన శ్రీకాంత్ ప్రస్తుతం వరంగల్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

శ్వేతార్కుడికి అభిషేకం

కాజీపేట: కాజీపేట స్వయంభు శ్వేతార్క మూలగణపతి స్వామి వారికి గురువారం గులాలుతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మల ఆధ్వర్యంలో కన్నుల పండువగా పూజలు చేశారు. భక్తులకు మహా అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లుశర్మ, దేవులపల్లి సదానందం, రాజ్‌మోహన్, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, సుధీర్ పాల్గొన్నారు.

నియామకం


రియాజ్

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా పీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, హనుమకొండకు చెందిన డాక్టర్ మహమ్మద్ రియాజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి నియమించారు. ఈ కమిటీకి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా.. ఏడుగురు సభ్యులతో ఈ కమిటీ రూపొందింది.

బెల్ట్ షాపుల నిర్వహణ నేరం

కాజీపేట: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పట్టణంలో బెల్ట్ దుకాణాల నిర్వహణ, మాదక ద్రవ్యాల విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ అన్నారు. కాజీపేట పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున మద్యం విక్రయించొద్దని తెలిపారు. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే మద్యం నిర్వహించొద్దని ప్రచారం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లుగా అనుమానం ఉంటే 87126 59020నంబర్‌కు ప్రజలు ఫోన్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు.

కార్పొరేటర్‌ను కలిసిన బీజేపీ నాయకులు




హన్మకొండ అర్బన్ : నగరంలోని 60వ డివిజన కార్పొరేటర్, బీజేపీ నాయకుడు దాస్యం అభినవ్ భాస్కర్‌ను 62, 63, 47 డివిజన్ల బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు గురువారం వడ్డెపల్లిలోని అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినవ్‌భాస్కర్‌ను శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్‌గౌడ్, చాంద్‌పాషా, మోతిలాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం..

హసన్‌పర్తి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ అన్నారు. ముచ్చర్లలోని మిలినియ్ పాఠశాల మైదానంలో నాలుగురోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్‌పోటీలు గురువారం ముగిశాయి. ఈకార్యక్రమానికి దాస్యం అభినవ్ భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఖిలా వరంగల్ జట్టు విన్నర్‌గా రూ.50 వేలు, ముచ్చర్ల జట్టు రన్నరప్‌గా రూ.25నగదు బహుమతి అందుకుంది. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈపోటీలు జరిగాయి. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ కార్యదర్శి అరూరి విశాల్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, చిర్ర రాజు, వీరస్వామి, ప్రమోద్, అనిల్ పాల్గొన్నారు.

జాతీయ వైద్య సదస్సుకు డాక్టర్ కూరపాటి



హన్మకొండ చౌరస్తా: ఈనెల 29, 30 తేదీల్లో ఢిల్లీలో యంగ్ హైకాన్ (హెచ్‌ఎస్‌ఐసీఓఎస్) సంస్థ హెర్నియాపై నిర్వహించనున్న జాతీయ స్థాయి వైద్య సదస్సుకు హనుమకొండకు చెందిన డాక్టర్ కూరపాటి రమేశ్ పాల్గొననున్నారు. నూతన వైద్య విధానంపై జరుగుతున్న జాతీయ సదస్సులో ప్రసగించేందుకు ఆహ్వానించినట్లు కూరపాటి ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పేద మధ్య తరగతి ప్రజలకు అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపీ హెర్నియా వైద్య చికిత్సపై ప్రసంగించనున్నట్లు తెలిపారు.

వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీదే గెలుపు

- బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్


రమేష్‌ను సన్మానిస్తున్న బీజేపీలో చేరిన నాయకులు

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సారి బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జఫర్‌ఘడ్ మండలం వడ్డెగూడేనికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ మండల అధ్యక్షుడు కోరుపప్పుల నగేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు అరూరి రమేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో తనకు ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. అత్యధిక మెజారిటీ వచ్చేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. పార్టీలో చేరినవారిలో బొడ్డు అశ్విని, విజయ, రాణి, రంగమ్మ, అంబిక, రేణుక, శోభ, పద్మ, శాంత, రాజు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి గౌడ్, సురేష్ గౌడ్, రమేష్, రాజు, శ్రీను, అరవింద్, శ్రీనివాస్ గౌడ్, లోకేష్ గౌడ్, గణేష్ గౌడ్, రామరాజు గౌడ్ పాల్గొన్నారు.

చేరిక

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. హనుమకొండలోని నివాసంలో ఆయన పలువురికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. బీజేపీలో చేరిన వారిలో ముచ్చు రాజ్‌కుమార్, తట్ల సందీప్, ఉజ్జేతుల కృష్ణ, బొగి సాంబశివరావు, బొగి మధు, బండ రాజు, బోగి భాస్కర్, తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. మడికొండ బీజేపీ నాయకులు అరూరి రమేశ్‌ను గురువారం ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. కలిసిన వారిలో పొనగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, నాగవల్లి గోపికృష్ణ, దారవత్ సునిల్, శివ, వెంకటేష్, నిఖిల్‌రావు, శ్రీధర్, రంజిత్, కుమార్, రాజేష్, అరవింద్, రాజ్‌కుమార్ ఉన్నారు.

బాక్సింగ్ పోటీల్లో తనుశ్రీకి కాంస్యం


తనుశ్రీని సన్మానిస్తున్న క్రీడాభిమానులు

వరంగల్ స్పోర్ట్స్ : ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు యూపీలోని నోయిడాలో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో హసన్‌పర్తికి చెందిన శీలం తనుశ్రీ కాంస్యం పతకాన్ని సాధించింది. 64–67 కేజీల విభాగంలో ఢిల్లీ క్రీడాకారిణితో తలపడిన తనుశ్రీ మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్‌ను సొంతం చేసుకుంది. తనుశ్రీ హసన్‌పర్తి మండలం కోమటిపల్లికి చెందిన సందెల శ్యాంసన్ వద్ద శిక్షణ పొందుతుంది. ఇంటికి చేరుకున్న తనుశ్రీ, కోచ్ శ్యాంసన్‌లకు క్రీడాభిమానులు ఘన స్వాగతం పలికారు.

తనుశ్రీకి సన్మానం

హసన్‌పర్తి: జాతీయ స్థాయి బాక్సింగ్‌పోటీల్లో కాంస్య పతకం సాధించిన శీలం తనుశ్రీ ని హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సన్మానించారు. తొలుత శ్రీఎర్రగట్టు క్రాస్‌నుంచి హసన్‌పర్తి వరకు ర్యాలీ నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, చంద్రమోహన్, సురేందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, నర్సింహరాములు, పార్థసారథి, చకిలం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రామకృష్ణకు అవకాశం ఇవ్వాలి


మాట్లాడుతున్న పాస్టర్ ఐజాక్

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ స్థానాన్ని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు కేటాయించాలని ట్రై సిటీ క్రిష్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఐజాక్, ఉపాధ్యక్షుడు పాస్టర్ జోసఫ్ ప్రభాకర్ ఏఐసీసీ నేతలతోపాటు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మూడున్నర లక్షల దళిత క్రిష్టియన్ల ఓట్లు ఉన్నాయన్నారు. రామకృష్ణకు టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల గెలుపులో రామకృష్ణ కీలకపాత్ర పోషించారని తెలిపారు. విద్యావంతుడిగా.. పేదల డాక్టర్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో సువర్ణ రాజ్, లాజరస్, తాళ్లపెల్లి ప్రసంగి, డేవిడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సుగుట్ట రోడ్డుపై లారీ బోల్తా..

- డ్రైవర్, క్లీనర్ క్షేమం



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట మూలమలుపు వద్ద నిమ్మకాయల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ ధ్వంసం అయినప్పటికీ క్యాబిన్ నుంచి డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి మార్కెట్ నుంచి గోరక్ పూర్‌కు గురువారం నిమ్మకాయల లోడుతో వెళ్తున్న లారీ గురువారం ఉదయం 6గంటలకు వరంగల్ ఉర్సు గుట్ట మూల మలుపున డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది.
ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడగా లారీ ధ్వంసమైంది. ఈవిషయం తెలిసిన వెంటనే స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యకు సమాచారం అందజేసి ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా రోడ్డుపై పడిపోయిన నిమ్మకాయల బ్యాగులను మరో లారీలో లోడు చేసి జేసీబీ సాయంతో ధ్వంసమైన లారీని రోడ్డు పక్కకు జరిపారు. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఘటన వివరాలు సేకరించారు.

నేడు జక్రియాలో ఇఫ్తార్

హన్మకొండ చౌరస్తా : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేడు (శుక్రవారం) హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయనున్నారు. ఇఫ్తార్‌కు ముస్లింలు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న ఎర్రగట్టు జాతర

- భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం
- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం క్షీరాభిషేకం, అర్చన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాలుగో రోజూ భక్తుల తాడికి కనిపించింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం కిక్కిరేసింది. బ్రహోత్సవాలను పురస్కరించుకుని విశ్వక్సేనా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈట కిషన్‌రావు, ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, కనపర్తి రాజు, పెద్దమ్మ సురేష్, శైలజ, సుమంత్, ప్రశాంత్ కుమార్, శ్రీనాథ్‌గౌడ్, వేల్పుల సదానందం, నరోత్తంరెడ్డి, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఉత్సవాల ముగింపు

నేటి(శుక్రవారం)తో బ్రహోత్సవాలు ముగియనున్నాయి. సాయంత్రం హసన్‌పర్తి– భీమారం గ్రామాల్లో అలివేలు మంగ–వెంకటేశ్వరస్వాములు ఊరేంపు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

హన్మకొండ చౌరస్తా : ఈనెల 30వ తేదీన హనుమకొండ చౌరస్తాలోని ఎంఎస్ రెడ్డి కాంప్లెక్స్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంఎన్‌కే సర్వీసెస్ ఎండీ మేఘన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే సంస్థలో పనిచేసేందుకు నిర్వహించే ఇంటర్వ్యూలకు పది, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగినవారు అర్హులుగా పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నెలకు రూ.20వేల వేతనం ఉంటుందని తెలిపారు. సందేహాలుంటే 82473 58727 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

మహిళలు సఖి సేవలు వినియోగించుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న వినీల

హన్మకొండ అర్బన్ : సఖి కేంద్రం సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి వన్ స్టాప్ కేంద్రం కౌన్సిలర్ విజయలక్ష్మి, కేస్ వర్కర్ వినీల సూచించారు. నగరంలోని రెవెన్యూ కాలనీలో జేఎస్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపదలో ఉన్న మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. సఖి వన్ స్టాప్ కేంద్రం ద్వారా మహిళలకు అందజేస్తున్న సేవలను వివరించారు. మహిళలు, బాలికలు అత్యవసర సమయాల్లో సాయం కోసం 0870–2452112 నంబర్, టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేఎస్‌ఎస్ సంస్థ డైరెక్టర్ ఎండీ ఖాజా, ప్రాజెక్ట్ మేనేజర్ తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను బాధ్యతగా నిర్వహించాలి

వరంగల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను బాధ్యతగా నిర్వహించాలని డీఆర్డీఓ కౌసల్యాదేవి అన్నారు. రాయపర్తి మండలంలోని 22 కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులతో డీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెటింగ్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కమిటీ సభ్యులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీడో కౌసల్యాదేవి మాట్లాడారు. ఐదుగురు కమిటీ సభ్యులు బాధ్యత వ్యవహరించాలని, ట్యాబ్‌లో నమోదు చేయడం, తేమ శాతం, గన్నీ సంచుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని చెప్పారు. రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, ఏడీఆర్డీఓ, డీపీఎం, ఏపీఎంలు, వివిధ గ్రామాలకు చెందిన కొనుగోలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్పెల్ బీలో స్పెక్ట్రా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఉపాధ్యాయులు

హన్మకొండ: వీ.కే.స్పెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండ భవానినగర్‌లోని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తమ పాఠశాల నుంచి 68 మంది విద్యార్థులు పాల్గొనగా 67 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ప్రథమ, ఒకరు ద్వితీయ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ ప్రశాంతి వెల్లడించారు. మిగతా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షకు అర్హత సాధించారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వీధి కుక్కల వీరంగం

- వృద్ధురాలు, చిన్నారిపై దాడి, తీవ్ర గాయాలు



వీధి కుక్కలదాడిలో గాయపడ్డ చిన్నారి డాలీ, వృద్ధురాలు కనకలక్ష్మి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలో గురువారం వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. స్థానిక రాసమల్ల వాడకు చెందిన వృద్ధురాలు పలబిందల కనకలక్ష్మి నిత్యావసర సరుకులు తీసుకొచ్చేందుకు కిరాణాషాపునకు వెళ్తుండగా.. రెండు వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి.. ఎడమ చెయ్యిని కొరికాయి. తీవ్ర రక్త స్రావం కావడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంది. అదేవిధంగా.. ఎస్సీ కాలనీకి చెందిన ఐదేళ్ల డాలీ అనే చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా.. వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారి నుదుటితో పాటు చెయ్యికి తీవ్ర గాయాలయ్యాయి. బల్దియా సిబ్బంది వీధి కుక్కల బెడద తొలగించి ప్రాణాలు కాపాడాలని స్థానికులు వేడుకుంటున్నారు.